## సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడుతున్నట్లు బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం పరిధి లోని బొగ్గులకుంటలో మంగళవారం ఆనంద్‌కుమార్ గౌడ్ పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీవరేజీ సమస్య ఉందని ప్రజలు ఫిర్యాదు చేయగా ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు గాను సంబంధిత అధికారులను కలిసి వివరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సబియా మేడం, ఉజ్మా అలీం, ఇష్రత్ సుల్తాన, జరీనా బేగం, అర్షియా బేగం, జోసఫిన్, మీర్ సాజిద్ అలి, ముజామిల్, అహ్మద్, ఇస్మాయిల్, మీర్ సర్దార్ అలి, పర్వేజ్, సమద్, యూసుఫ్ పాల్గొన్నారు. - అబిడ్స్, అక్టోబర్ 31

## దసరా సమ్మేళనం




గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను సన్మానిస్తున్న ఎస్.ఎస్.కె.సమాజ్ సభ్యులు

అబిడ్స్, అక్టోబర్ 31 : ఎస్.ఎస్.కె. సమాజ్ ఆధ్వర్యంలో దసరా సమ్మేళనం నిర్వహించారు. రహీంపురాలోని సమాజ్ కార్యాలయంలో జరిగిన ఈ సమ్మేళనంలో నగరంలోని సమాజ్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్.ఎస్.కె. సమాజ్ ఆధ్వర్యంలో ప్రతిసంవత్సరం దసరా సమ్మేళనం నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మంగళ్‌హాట్ కార్పొరేటర్ ఎం. శశికళ కృష్ణ, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్, సమాజ్ అధ్యక్షుడు నగరి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కాటిగర్ శంకర్‌రావు, కోశాధికారి శివరతన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు హెచ్.కుమార్, డాక్టర్ ఉదయ్ చవాన్, స్పోర్ట్స్ క్లబ్ సాయి, పండు, విశ్వనాథ్, ఆనంద్, బదేఖాన్ మహవీర్, చవాన్ యశ్వంత్, సురేందర్ సింగ్, రతన్ కమల్ పాల్గొన్నారు.

## దాడిలంబాడీలు రాజకీయంగా ఎదుగాలి

రవీంద్రభారతి, అక్టోబర్ 31 : దాడి లంబాడీలు రాజకీయ ఎదుగాలని దాడి లంబాడీ హక్కుల సాధన సమితి (డీఎల్‌హెచ్ఎస్ఎస్) వ్యవస్థాపక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రుడావత్ రఘు నాయక్ అన్నారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో రఘునాయక్ మాట్లాడుతూ.. దాడి..లంబాడిలు రాష్ట్రంలో ఐదు నుంచి ఆరు లక్షల మంది వరకు ఉన్నారని చెప్పారు. తమకు ఎస్టీ రిజర్వేషన్లు ఉన్నప్పటికీ లంబాడీల్లో ఉప తెగలైనా దాడి, డాలియా, సనార్, గోర్, బట్ ఉప తెగలు పూర్తిగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉప కులాల సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలని కోరారు. దాడి థాల్య అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలన్నింటిలో దాడిలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. జీవన స్థితిగతులపై అధ్యాయనం చేయడానికి ఒక ఉన్నత స్థాయి అధికారి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం మాతృదేవోభవ శీర్షికన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఈఐఎఫ్ డైరెక్టర్ ఈ. నిర్మల చేసిన కృషికి గాను సినీ నటి కవిత, నిర్మాత రామ సత్యనారాయణ, సాహితీవేత్తలు బి. రఘు కిరణ్, ఈ.శ్యాముల్‌రెడ్డి, నిర్వాహకులు డాక్టర్ దేవసేన మాతృమూర్తి పురస్కారంతో సన్మానించారు. - తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 31

## అధ్యయనం చేస్తూ రచనలు సాగించాలి

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 31. సమాజాన్ని అధ్యయనం చేస్తూ సాగించే రచనలు రావాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారగ్రహీత సలీం ఆకాంక్షించారు. తెలుగు సాహిత్యంలోని ప్రఖ్యాత కవి పండితుల స్వీయ జీవిత, సాహిత్య విశేషాలు, విజయాలను పాఠకులతో పంచుకునే ప్రసంగాల పరంపర నేను నా రచనలు శీర్షికతో తెలంగాణ సారస్వత పరిషత్తు మంగళవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో తొలి వక్తగా సలీం పాల్గొన్నారు. కటిక పేదరికం నుంచి వచ్చిన తాను ప్రతిభావంతుడిగా రాణించి ఉన్నత స్థాయికి చేరుకున్నానని వివరించారు. 1980లో మనిషి అనే తొలి కథతో రచనలు ప్రారంభించి 300లకు పైగా కథలు రాసి 12సంపుటాలుగా ముద్రించానని, 30 నవలలు వెలువరించానని, అనేక భాషలలోకి అనువాదం కావడమే కాకుండా ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నానని తెలిపారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. జీవిత పాఠాలే సలీంను గొప్ప రచయిత, వ్యక్తిగా మలిచాయన్నారు. ఓయూ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్యులు కాసీం, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య పాల్గొని సలీం రచనా శైలిని కొనియాడారు.



రచయిత సలీంను సన్మానిస్తున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, చెన్నయ్య, కాశీం

## చెత్త డంపింగ్ లేకుండా చూడాలి



ఫిరోజ్‌గాంధీ పార్క్ వద్ద వేస్తున్న చెత్తను ఎత్తి వేయించాలని పార్క్ వాకర్స్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలో చెత్తను డంప్ చేయరాదని పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని నాయకులు వి.కిషన్ యాదవ్, ఎన్.ఆర్. లక్ష్మణ్‌రావు, కృష్ణ ప్రసాద్, వసంత్, హనుమంతరావు, రాజు, కిశోర్ ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త డంపింగ్‌ను వెంటనే ఇక్కడి నుంచి ఎత్తి వేయాలని వారు పార్క్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారులు వెంటనే స్పందించక పోతే ఆందోళనలు చేపడ్తామన్నారు. - అబిడ్స్, అక్టోబర్ 31

## హ్యాట్రిక్ విజయం ఖాయం



అబిడ్స్, అక్టోబర్ 31 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని గోషామహల్ మాజీ కార్పొరేటర్ ముఖేశ్‌సింగ్ అన్నారు. గోషామహల్‌లో పలు సంఘాల వారు ఏర్పాటు చేసిన సమావేశంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ధూల్‌పేట్‌లోని లోథ్‌లకు సీఎం అనేక పథకాలను తీసుకువచ్చారన్నారు. ప్రధానంగా ఆత్మగౌరవ భవన నిర్మాణానికి స్థలం, నిధులు విడుదల చేశారన్నారు. ఆయనకు లోధ్‌లు బుణపడి ఉంటారన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు విశేష ప్రజాదరణ ఉందని, అభివృద్ధిని గుర్తించిన నియోజకవర్గం ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు సంసిద్ధులై ఉన్నారని తెలిపారు. నియోజకవర్గం నుంచి లోథ్ సమాజానికి చెందిన అభ్యర్థిని రంగంలోకి దింపితే ఎమ్మెల్యే రాజాసింగ్‌ను చిత్తుగా ఓడించవచ్చని పలు సంఘాల వారు కోరుతున్నారని పేర్కొన్నారు. గోషామహల్ కార్పొరేటర్‌గా ఐదేండ్లలో అనేక అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని పార్టీ ఆదేశిస్తే పోటీకి దిగి రాజాసింగ్‌ను ఓడించి బీఆర్ఎస్ ఘన విజయానికి పాటు పడ్తానని ధీమా వ్యక్తం చేశారు.

## పటేల్ అడుగు జాడల్లో నడువాలి

అబిడ్స్, అక్టోబర్ 31: జాతీయ ఐక్యతకు కృషి చేసిన మహనీయుడు సర్దార్ వల్లాభాయ్ పటేల్ అని, ఆయన అడుగుజాడలో యువత నడుచుకుని దేశ ఐక్యత, అభివృద్ధికి పాటుపడాలని సినీ నిర్మాత, నటుడు షేక్ రహ్మతుల్లా పేర్కొన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో భారతరత్న సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని మొజంజాహి మార్కెట్ నుంచి సరోజినీ నాయుడు వనితా మహవిద్యాలయం వరకు ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రహ్మతుల్లా మాట్లాడుతూ.. సమైక్య దేశంగా రూపుదిద్దిన ఉక్కు మనిషి సర్దార్ పటేల్ అని కొనియాడారు. వనితా మహ విద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ శోభన దేశ్‌పాండే మాట్లాడుతూ.. 550లకు పైగా స్వతంత్ర రాజ్యాలను భారత్‌లో కలిపి.. ఐక్య భారత్ నిర్మాణానికి సర్దార్ పటేల్ కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ.. బ్రిటిష్ హయాంలో మత కలహాలతో ఇబ్బంది పడిన భారత్‌లో శాంతికి కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ మైదానంలో షేక్ రహ్మతుల్లాకు జాతీయ ఐక్యత అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంఘ సేవకులు కాశమని శ్యామ్‌రావు ముదిరాజ్, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ ఎన్.సుప్రియ, అధికారులు ఎన్.స్వాతి, నాగలక్ష్మి, ఎ.సంధ్య పాల్గొన్నారు.



జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా ఎగ్జిబిషన్ మైదానంలో సినీ నిర్మాత, నటుడు షేక్ రహ్మతుల్లా ఖాన్‌కు అవార్డును ప్రదానం చేస్తున్న తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్

## వాహనాల తనిఖీలు



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలను చేపట్టారు. ట్రూప్ బజార్ ప్రాంతంలో మధ్యాహ్నం తనిఖీలను చేపట్టారు. ఈ తనిఖీలలో అబిడ్స్ ఏసీపీ ఎ.చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ టి.నరసింహరాజు, ఎస్సైలు, సిబ్బందితో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీం సభ్యులు పాల్గొన్నారు. అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ నరసింహరాజులు మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ప్రతి నిత్యం వాహనాలను తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఎన్నికల నిబంధనలను పాటించాలని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. - అబిడ్స్, అక్టోబర్ 31

## విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా..

మెహిదీపట్నం, అక్టోబర్ 31 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ హుమాయూన్‌నగర్ ఫీడర్ హుమాయూన్‌నగర్, మెహిదీపట్నం, ఎంఐజీహెచ్, శ్రీరాం నగర్, మురాద్ నగర్, 11 కేవీ జహరా మసీద్ ఫీడర్ హుమాయూన్ నగర్, విజయనగర్ కాలనీ, ఒవైసీ పార్కు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు,11 కేవీ శాంతినగర్ ఇంపీరియల్ గార్డెన్, మొఘల్ రెజెన్సీ అపార్ట్‌మెంట్, మోర్ సూపర్ మార్కెట్, శాంతినగర్, విజయనగర్ కాలనీ, లక్ష్మీ నగర్, పి.ఎస్.నగర్, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

## ఉక్కుమనిషి సర్దార్ పటేల్‌కు నివాళి



సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా గుడిమల్కాపూర్ డివిజన్ కార్యాలయం వద్ద ఆయన చిత్ర పటానికి బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ, గంగాధర్, నామా యాదగిరినేత, అనీల్ పూలమాల వేసి నివాళులర్పించారు.– కార్వాన్, అక్టోబర్ 31